పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయిత విహారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, చిరునవ్వు సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత చిత్రపు హన్మంతరావు రచించిన ఏడడుగులు, వర్ణచిత్రం పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విహారి మాట్లాడుతూ.. సమాజ సంఘటనల కంటే సన్నివేశ చిత్రీకరణ ప్రత్యేకతగా తెలుగు కథ, నవలలు రాణించాయని గుర్తుచేశారు. అనంతరం రచయిత దంపతులను ఘనంగా సన్మానించగా అంతకు ముందు కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత రాయవరపు గణేశ్వరరావు ఆకాశవాణి విశ్రాంత అధికారి సీఎస్.రాంబాబు, సంస్థ అధ్యక్షులు రాంచంద్రరావు, కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ అంబా గార్డెన్ ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, అంబా గార్డెన్, గుడిమల్కాపూర్, క్రాంతి నగర్, జీవన్ కల్యాణ్ నగర్, హిల్‌కాలనీ, విజయ్ అపార్ట్‌మెంట్స్, సాయి అపార్ట్‌మెంట్స్, హుడా కాలనీ, సాయి గార్డెన్, దేవరత్న అపార్ట్‌మెంట్స్, విజయ సుశీల అపార్ట్‌మెంట్స్, గణేష్ రెసిడెన్సీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డుప్కీ పున్నం.. సర్వం సిద్ధం

- నేడు జాతరకు అంకురార్పణ
- ముస్తాబైన త్రివేణి సంగం
- ముక్తి స్నానాలకు ఏర్పాట్లు పూర్తి

లంగర్‌హౌస్: కార్తీక పౌర్ణమి ముక్తి స్నానాల (డుప్కీ పున్నం) జాతరకు లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగం ముస్తాబయ్యింది. త్రివేణి సంగంలో పీఠాధిపతులు 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ముక్తి స్నానాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మీసాల రాముడు కొలువుదీరిన జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి మఠ ఆలయం కార్తీక పౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యింది. ఈ సంవత్సరం వరదలు ఎక్కువ రావడంతో నూతన శుద్ధమైన నీరు ఈ ప్రాంతంలో చేరింది. దీంతో ఈ సంవత్సరం నదీ స్నానాలకు మరింత ఎక్కువ మంది భక్తులు తరలివస్తారని అంచనావేసి ఏర్పాట్లు చేస్తున్నారు. నదీ స్నానాలతో పాటు భక్తుల సౌకర్యార్థం నీటి ట్యాంకర్లు, షవర్లును కూడా బాపూఘాట్ బ్రిడ్జి ప్రాంతంలో ఏర్పాటు చేశారు. డుప్కీ పున్నం జాతరకు నేడు అంకురార్పణ జరుగనుంది. ముక్తి స్నానాలకు నగరం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. బుధవారం రాత్రి తులసీ సమేత లక్ష్మీ నారాయణుల వివాహం, జ్వాలా తోరణం ఉంటుంది. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవాల్లో సంగం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.



త్రివేణి సంగంలో పూజలు, స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)

స్వామి వారి స్నానాలతో ప్రారంభం..

హిమగంగ, గుప్తగంగా, ముచ్కుంద నదుల కలయిక అయిన త్రివేణి సంగంలో స్నానాలు ఆచరిస్తే ముక్తి కలుగుతుందని నమ్మకం. 14వ తేదీ అర్ధరాత్రి దాటాక స్వామి వారిని పల్లకీలో ఊరేగిస్తారు. నదీమ తల్లికి మహా హారతి, మంత్ర పుష త్రివేణి సంగంలో స్వామి వారికి స్నానం ముక్తిస్నానాలు ప్రారంభమవుతాయి.



నదీమ తల్లికి పూజలు చేసి, నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం పెళ్లినాటి బాసింగాలను నదిలో వదిలేస్తారు.



రామచంద్రజీ మఠ ఆలయం(ఫైల్)

కుండలీబర్‌నా..

సంగం డుప్కీ పున్నం జాతరలో ప్రధానంగా చెప్పుకునేది కుండలీ బర్‌నా పూజా కార్యక్రమాలు. ఈ పూజా కార్యక్రమాలు ఉత్తర, దక్షిణ భారతదేశాల్లోని రాజ్‌పుత్, లోధ్ తదితర సమాజం వారు నిర్వహిస్తారు. సంవత్సర కాలంలో వివాహాలు జరిగిన నూతన దంపతులు పెళ్లి దుస్తులతో

రథోత్సవం..

కార్తీక ముక్తి స్నానాల జాతరలో భాగంగా సంగం వద్ద సీతారామలక్ష్మణులకు వైభవంగా రథోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 15న తెల్లవారుజామున స్వామి వారిని అందంగా ముస్తాబు చేసి రథంపై ఊరేగిస్తారు. తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమై వేదపండితులు, సన్నాయి వాయిద్యాలు, భజనలు చేస్తు లంగర్‌హౌస్ పుర వీధుల్లో రథోత్సవం నిర్వహిస్తారు. ఊరేగింపులో భాగంగా రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం కోటి తులసీ దళ అర్చన, రోజంతా భక్తులకు స్వామి వారి దివ్య మంగళ స్వరూప దర్శనం, మహా హారతి, అర్చన, సాయంత్రం సీతారామలక్ష్మణులను విశేష బంగారు తిరుచిపై ఊరేగించనున్నారు. సాయంత్రం 7 గంటలకు సామూహిక దీపారాధన, ఉంటాయి.

దర్శించి తరించండి..



డుప్కీ పున్నమి జాతర కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. పక్కన తపోవనం తో పాటు వన భోజనాల కోసం త్రివేణి సంగం పరిసరాల్లో ఆహ్లాదకరమయిన వాతావరణంలో నిర్వహించనున్నాం. ఆలయం పక్కన తపోవనం పార్కులో పచ్చకబయళ్లు, చెట్లకింద వనభోజనాలకు ఏర్పాట్లు చేశాం. మంచి నీటిని కూడా ఇక్కడ ఉచితంగా అందించనున్నాం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించి తరించండి.

– 1008 రాహుల్‌దాస్ బాబా, పీఠాధిపతి

పుణ్యఫలం కోసం..

కార్తీక పౌర్ణమి రోజున ఉసిరి కాయపై 365 వత్తులను పెట్టి ఆవు నెయ్యితో దీపారాధన చేసి నదీమ తల్లికి హారతి ఇస్తే పుణ్యం ప్రాప్తిస్తుంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దయెత్తున దీపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. దీని కోసం ఆలయం ముందు రాంలీలా మైదానంలో ఉసిరి, రాతి, వేప చెట్ల కలయిక వద్ద ఏర్పాట్లు చేశారు.

త్రివేణి సంగం నది మధ్యలో శివారాధన..

కార్తీక మాసం అంటేనే శివారాధన. అలాంటిది శివలింగానికి అభిషేకాలు మరింత ప్రీతిదాయకం. జాతరలో భాగంగా త్రివేణి సంగం నది మధ్యలో వెలసిని శివలింగాలను పూజించడంతో భక్తులు పోటీపడుతుంటారు. చాపరాయిపై పలు శివ లింగాలు ఏర్పడటంతో వాటికి అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలను వెలిగిస్తుంటారు.

ఘనంగా ఉర్దూ దినోత్సవం



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

గోల్కొండ: గోల్కొండ మోతీదర్వాజాలోని ది రైజింగ్ స్టార్ నేషనల్ హైస్కూల్‌లో ఆదివారం అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉర్దూ కవిత పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ షేహబాజ్ అహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ.. ఉర్దూ ఎంతో సరళమైన భాష అని భారతదేశంలో ప్రజాదరణ పొందిన భాష అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కవితలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే మత్స్యకారుల అభ్యున్నతి



సాయికుమార్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే మత్స్యకారుల అభ్యున్నతి జరుగుతుందని రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. 11 నెలల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మెట్టు సాయికుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులే కోట్లాది రూపాయాలు లూటీ చేశారన్నారు. చేపల పెంపకం పేరుతో బీఆర్ఎస్ నాయకులంతా దగా, మోసం చేశారని ఆయన ఆరోపించారు. మత్స్యశాఖను మరింత పటిష్టం చేసేందుకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు కర్ణాటకలోని బెంగళూర్, మైసూర్‌తో పాటు పలు నగరాల్లో మత్స్యశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యాటన చేపడుతామని ఆయన వివరించారు. పలు రాష్ట్రాలలో మత్స్యశాఖపై అధ్యాయనం తర్వాత రాష్ట్రంలో నూతన పాలసీ తెస్తామని మెట్టు సాయికుమార్ వివరించారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్



పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో నాగేందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: ఫైర్‌ఫాక్స్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ లీగ్ ఉమెన్, ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి పి.నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ పోటీల్లో యువ ఆటగాళ్ల అద్భుత ప్రతిభను కనబరిచారని కొనియాడారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాబోయే జాతీయ స్థాయి టోర్నమెంట్లలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రాజ్‌కుమార్, కోచ్ వేణుగోపాల్, సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హెచ్‌ఎస్‌ఎస్ ఫెయిర్



యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న సంస్కార్ కేంద్ర నిర్వాహకులు



బీఎంఎఫ్ ఆధ్వర్యంలో అనాథ సేవ వివరాలు అందిస్తున్న దృశ్యం

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన హెచ్‌ఎస్‌ఎస్ ఫెయిర్ ఆకట్టుకుంది. మనిషి జీవన విధానాలు, ఆరోగ్యం, తినుబండారాలు, ఆధ్యాత్మిక భావాలు, వివిధ రకాల మొక్కలు, విద్యార్థులకు ఉపయోగపడే సైన్స్ లాంటి దాదాపు 300 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన హెచ్‌ఎస్‌ఎస్ ఫెయిర్ ఆదివారంతో ముగిసింది. నగరంలోని సరస్వతి శిశుమందిర్‌ల విద్యార్థులతో పాటు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించే సామాజిక సంస్థల నిర్వాహకులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు తిలగించారు.

శ్రీశ్రీ సన్స్‌కార్ కేంద్రంలో యోగాపై అవగాహన..

శ్రీశ్రీ సన్స్‌కార్ కేంద్రంలో యోగాపై అవగాహన కల్పించారు. యోగా, మెడిటేషన్‌తో కలిగే లాభాలను వివరించారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురు రవిశంకర్ మహారాజ్ బోధనలు నిర్వాహకులు సందర్శకులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ యాంత్రిక జీవనంలో కొంతసేపైనా యోగాసనాలు, మెడిటేషన్ చేయాలని వారు వివరించారు.

బీఎంఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత సేవలు..

వృద్ధులకు, అనాథలకు ఉచిత సేవలు అందిస్తామని భారతి మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన చేపట్టారు. ఓల్డేజ్, ఆర్ఫన్, హ్యాండీక్యాప్డ్, బ్లైండ్, డిసబుల్ ఉన్నవారికి తమ ఆశ్రమాలలో ఉచితంగా ఉంచుకొని వారికి అన్నివిధాల సహకారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99085 87340 లో సంప్రదించాలని నిర్వాహకులు వెల్లడించారు. శారధి మెమోరియల్ ఫౌండేషన్ ఉచితంగా సేవలందించడమే తమ లక్ష్యమన్నారు.


దేవర కరుణాకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: దివంగత బీజేపీ నేత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ పార్టీ పటిష్టానికి జీవితాంతం కృషి చేశారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవర కరుణాకర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గుడిమల్కాపూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవర శ్రీనివాస్, దేవర వంశీ, రాధాకిషన్‌యాదవ్, సాగర్, అశ్విన్ తదితరులున్నారు.

బీఎల్‌ఓలు లేక పోలింగ్ స్టేషన్ వెలవెల



అబిడ్స్: జీహెచ్‌ఎంసీ అధికారులు ఓటరు లిస్టులలో పేర్ల నమోదుకు ఆదివారం అన్ని ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌ఓలను ఏర్పాటు చేశారు. అబిడ్స్ 14వ సర్కిల్ గోడే కబర్ ప్రాంతంలోని 99, 100వ పోలింగ్‌స్టేషన్ల కార్యాలయంలో బీఎల్‌ఓలు ఎవ్వరు అందుబాటులో లేరు. స్థానిక ప్రజలు ఓటరు లిస్టుల నమోదులు, ఇతర తప్పొప్పులను సరిదిద్దేందుకు దరఖాస్తుల కోసం రాగా ఎవ్వరు అందుబాటులో లేక పోవడంతో తిరిగి వెళ్లిపోయారు. బీఎల్‌ఓలు అందుబాటులో లేకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తులను ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందించాలని జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తే 99, 100 పోలింగ్‌స్టేషన్ల బీఎల్‌ఓలు మాత్రం అందుబాటులో లేకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్వేకు సహకరించాలి

చాంద్రాయణగుట్ట: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజు ముదిరాజ్ కోరారు. ఈ మేరకు చాంద్రాయణగుట్టలో ఆదివారం ఆయన ఎన్యుమరేటర్లతో కలిసి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు న్యాయం చేసేందుకు సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు మేలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పీసీసీ అధ్యక్ష పదవిని సైతం బీసీ బిడ్డకే కట్టబెట్టిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేందుకు కుల గణన చేపట్టారన్నారు. ప్రజలంతా అపోహలు వీడి సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సి.రాహుల్, ఎస్.చెన్నయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్

గోల్కొండ: రెజ్లింగ్‌పై నేటి యువత మొగ్గు చూపుతుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెజ్లింగ్ కేవలం ఉత్తరాధి రాష్ట్రాలకే పరిమితమయ్యేదని అయితే నేడు తెలంగాణలో రెజ్లింగ్ పోటీలకు ఆదరణ పెరిగి ఇక్కడి రెజ్లర్లు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పాఠశాల విద్యార్థులకు రెజ్లింగ్ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు హైస్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని దీన్ని వల్ల రెజ్లింగ్‌లో యువకులు సత్తాచాటే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచిన్ కామ్లెకర్‌తో పాటు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీదేవి, రెజ్లింగ్ కట్ట నర్సింగ్‌రావు, కన్వీనర్ కె.బాల్‌రాజ్, కో కన్వీనర్ సీహెచ్.శ్యామ్‌రావు తదితరులున్నారు.

డైమండ్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల డైమండ్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఆర్.సురేష్ ఆనంద్ తెలిపారు. త్వరలో నిర్వహించే ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాలలో పలు సంస్థలు, కంపెనీలలో ఉన్నత స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ అమూల్యమైన సలహాలను, సూచనలను సహాయాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవ సమన్వయ కమిటీ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రమావత్ లాలు నాయక్, విజయభాస్కర్‌రెడ్డి, కె.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవం



బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

నాంపల్లి: నృత్య భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నందమూరి తారక రామారావు కళా మందిరంలో బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సినీ నటులు ధ్రువ వాయు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నృత్య భారతి పురస్కారాలు అందుకున్న నృత్య గురువులను నిర్మలా జగ్గారెడ్డి అభినందించారు. కళింగ ఫేమ్ డైరెక్టర్, కథా నాయకుడు ధ్రువ వాయు మాట్లాడుతూ..చిన్నారుల నృత్య ప్రదర్శనలను చూసే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు బొల్లంపల్లి మధుకర్ మాట్లాడుతూ.. కళలతోనే బాలలకు సంపూర్ణమైన వికాసం, జ్ఞానం లభిస్తుందన్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన బాలలకు జ్ఞాపికలు, పురస్కారాలను అందజేశారు. నృత్య గురువులకు నృత్య భారతి బిరుదులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నృత్య భారతి డైరెక్టర్ డాక్టర్ మల్లేష్, ఇందిరా పరాశరం, రమణి సిద్ధి పాల్గొన్నారు.

నయనానందకరం.. నవ వసంతోత్సవం



కళాకారులతో నృత్య గురువు ప్రసన్నరాణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శివచంద్ర లహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 9వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. నవ వసంత కింకిణి నాగ రసమయం పేరిట సంస్థకు చెందిన చిన్నారులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలువురు వక్తలు మాట్లాడుతూ..8 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులకు శాస్త్రీయ సంగీత కళలను నేర్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రముఖ నృత్య గురువు ఆర్.ప్రసన్నరాణి, డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, మహిళా భద్రత విభాగం డీసీపీ ఉషా విశ్వనాథ్, ఆర్‌టీఓ ఎస్.వాణి, సంస్థ అధ్యక్షురాలు చంద్రలేఖ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, టేలా బండ్ల పంపిణీ



పేదలకు సరుకులు, టేలా బండిని అందజేస్తున్న అంజాదుల్లా ఖాన్, బుంగ శివకుమార్

చార్మినార్: తాను గత శాసనసభ ఎన్నికలలో విజయం సాధిస్తున్నానని తెలుసుకున్న మజ్లిస్ పార్టీ అక్రమాలకు పాల్పడి పోలీసుల చేత అరెస్టు చేయించి ఎమ్మెల్యే కాకుండా ఆపారని మజ్లిస్ బచావో తహరీక్ (ఎంబీటీ) అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజాదుల్లా ఖాన్ ఆరోపించారు. యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన పేదలకు నెల రోజుల సరిపడా నిత్యావసర సరుకులతో పాటు వ్యాపారం నిర్వహించుకునేందుకు టేలా బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా లేనప్పటికీ నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంబీటీ నాయకులు బుంగ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఇద్దరు పిల్లల అదృశ్యం





చాంద్రాయణగుట్ట: తల్లి పిల్లలు అదృశ్యమైన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన వి.కవిత(35), శ్రీను భార్యాభర్తలు. వీరికి వి.బేలాక్షి(10), అక్షయ్ దేవ్(7)లు సంతానం. గత కొన్ని నెలలుగా దంపతుల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 6న సాయంత్రం 5.30 గంటల సమయంలో కవిత తన ఇద్దరు పిల్లలతో కలిసి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో, ఆమె తల్లి మస్రూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రేపు ఆదిత్య పరాశ్రీ స్వామి ప్రవచనాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న రవీంద్రభారతిలో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆధిత్య పరాశ్రీ స్వామి ప్రవచనం, గురువందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని ఆమని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తాలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ గాయని పి.సుశీల జన్మదినోత్సవం సందర్భంగా సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆవుల నాగరాజు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఉపాధ్యాయుల కేటాయింపులలో డిప్యూటేషన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన మెస్ ఛార్జీలను తక్షణం అమలు చేస్తూ నాణ్యమైన భోజనం, మంచినీరు అందించి, ఫుడ్ పాయిజన్ ఘటనలు నివారించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.రాజశేఖర్, హరీష్, ఆనంద్, విశాల, కుమార్, హేమంత్, సాయికుమార్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో పర్యాటకుల సందడి



చార్‌కమాన్–చార్మినార్ రోడ్డులో..



గుల్జార్‌హౌజ్ నడిరోడ్డులో...

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందడిగా కనిపించాయి. చార్మినార్ పరిసరాలు సందర్శకులతో రద్దీగా మారాయి. కాలు తీసి కాలు పెట్టలేని దుర్భర పరిస్థితులు ఇక్కడ కనిపించాయి. ఎటువైపు నుంచి వెళితే తమ గమ్యస్థానాలకు చేరుకుంటాం.. అనే మీమాంసలో వాహనదారులుండిపోయారు. అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా చార్మినార్ వైపు ముందుకు రావడం.. మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లడం..వాహనదారులకు నరకం కనిపించింది. వాహనాల రాకపోకలు నత్తను తలపించాయి. వాహనదారులకు గుల్జార్‌హౌజ్ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్ప లేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చార్మినార్ పరిసరాలలో సందర్శకుల రద్దీ విపరీతంగా కనిపించింది.